సాక్షి
గుంటూరు
గురువారం । 27 । జూన్ । 2024



అంకమ్మతల్లి ఆలయంలో పూజలు

యద్లపాడు: యద్లపాడు కాటి అంకమ్మతల్లి గుడిలో బుధవారం ఎన్డీఏ కూటమి నేతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 516 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.



విత్తన దుకాణాల తనిఖీ

కాకుమాను: కాకుమానులోని పలు విత్తన విక్రయ దుకాణాలను బుధవారం ఏఓ కె.కిరణ్మయి తనిఖీ చేశారు. స్టాకు వివరాలు, లైసెన్సులు పరిశీలించారు.

పంచముఖ ఆంజనేయునికి ప్రత్యేక పూజలు



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలోని పంచముఖ ఆంజనేయస్వామి గుడి 20వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

మహంకాళి అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు



తాడేపల్లిరూరల్ : కంతంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళి అమ్మవారి దేవస్థాన హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.సిహెచ్.వెంకటరెడ్డి మాట్లాడుతూ మహంకాళి అమ్మవారి దేవస్థానంలో హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం గుంటూరు దేవాదాయ శాఖ, ఆంజనేయస్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.వీరాంజనేయులు, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త డి.రంగప్రసాద్ పర్యవేక్షణలో జరిగిందని, హుండీలు లెక్కించగా రూ.12,10,467 వచ్చిందని, గత మార్చి నెలలో హుండీ లెక్కించగా రూ. 11,51,564లు వచ్చిందని, గతంలో కన్నా ప్రస్తుతం రూ.58,903 ఆదాయం పెరిగిందని, ఈ ధనాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని వివరించారు.

ఐదు మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మంగళగిరి మండలంలో 10.8 మిల్లీ మీటర్లు, ప్రత్తిపాడు 6.2, తెనాలి 1.4, పొన్నూరు 0.8, తాడేపల్లి మండలంలో 0.6 మి.మీ. చొప్పున వర్షం పడింది.

యార్డులో 47,926 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 44,834 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 47,926 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 20,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ.8,000 నుంచి రూ. 19,600 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 16,301 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

30న చేతిరాత నైపుణ్యంలో శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ఈనెల 30న చేతిరాత నైపుణ్యంలో ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పాల రామమోహనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చేతిరాత ఉద్యమంలో భాగంగా 3,545 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులతోపాటు 37వేల మందికిపైగా విద్యార్థుల చేతిరాతను అందంగా తీర్చిదిద్దిన క్యాలీగ్రఫీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో పాల్గొనేందుకు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 91820 53084 (వై.నాగమణి), 99122 20671 (శారద), 99590 85005 (ఇ.అనిల్), 98495 44892 (వి.రామమోహనరావు) నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

29న జాతీయ లోక్‌అదాలత్

మాచర్ల: రాష్ట్ర న్యాయసేవా సాధికార సంస్థ హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశాల మేరకు ఈనెల 29న మాచర్ల సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని మాచర్ల న్యాయసేవా సాధికార సంస్థ చైర్మన్, సివిల్ జడ్జి శ్రీనివాస్ కల్యాణ్ బుధవారం తెలిపారు. లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, సివిల్, మనోవర్తి, చెక్‌బౌన్స్, బ్యాంకులకు సంబంధించిన, రెవెన్యూ, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. మాచర్ల పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కేసులను పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి

- కలెక్టర్‌గా నాగలక్ష్మి బాధ్యతల స్వీకరణ
- పలువురు అధికారులు, ఉద్యోగుల అభినందనలు
- కలెక్టరేట్‌లో అధికారులతో తొలి సమీక్ష



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: కొత్త కలెక్టర్‌గా ఎస్.నాగలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని చాంబర్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలకు తొలి ప్రాధాన్యం ఇస్తానన్నారు. జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. అమరావతి రాజధాని ప్రగతితోపాటు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలిస్తామని వెల్లడించారు. అధికారులతోపాటు అందరితో కలిసి ముందుకు వెళతానని తెలిపారు. నాగలక్ష్మి 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రెండేళ్లపాటు జీఎంసీ కమిషనర్‌గా పని చేశారు. బాధ్యతల స్వీకారం సందర్భంగా కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, ఎస్పీ తుషార్ డూడీ, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, డీఆర్వో పెద్ది రోజా, జిల్లా అధికారులు, ఉద్యోగ సంఘ నాయకులు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు.

అన్నివిధాలా సహకరిస్తాం

అధికారులు, ఉద్యోగులు కలిసి పనిచేస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందించవచ్చని, తమ పూర్తి సహకారం ఉంటుందని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా తెలిపారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగలక్ష్మికి చాంద్‌బాషాతోపాటు ఉద్యోగ సంఘం నాయకులు బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా చాంద్ బాషా మాట్లాడుతూ పాలనలో తమ సహకారం ఉంటుందని, ఉద్యోగుల కనీస సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అందించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల విధుల రెమ్యునరేషన్ చెల్లించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై సానుకూల ధోరణితో ముందుకెళ్తానని చెప్పారు. జిల్లా నిర్వహణ కార్యదర్శి కరీముల్లా షాఖాదరి, కోశాధికారి పోతురాజు, నగర శాఖ అధ్యక్షులు నాగేశ్వరరావు, కార్యదర్శి పెదరత్తయ్య, సుమిత్ర దేవి, హేమలత పాల్గొన్నారు.



కలెక్టర్ నాగలక్ష్మిని ఆశీర్వదిస్తున్న తల్లిదండ్రులు



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టిసారిద్దాం

ప్రభుత్వాస్పత్రులపై ప్రత్యేక దృష్టి సారిద్దామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జిల్లా అధికారులతో కలిసి తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 29న జీజీహెచ్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష నిర్వహిస్తారని వివరించారు. 30న వ్యవసాయంపై సమీక్ష చేస్తారని వెల్లడించారు. మంత్రి సమీక్షలకు అవసరమైన అన్ని అంశాలతోపాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఇన్‌పేషెంట్స్, ఔట్ పేషెంట్స్, మందుల అందుబాటు తదితర అంశాలపై నివేదికలు సిద్ధంచేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.వెంకటేశ్వర్లు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, సీపీఓ శేషశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలను ఉపేక్షించం

జాయింట్ కలెక్టర్ రాజకుమారి



రేషన్ బియ్యం గోదామును పరిశీలిస్తున్న జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలను ఉపేక్షించబోమని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి స్పష్టం చేశారు. బుధవారం పట్టణంతోపాటు శివారు ప్రాంతాల్లోని ఎంఎల్ఎస్ పాయింట్లు, గ్యాస్ ప్లాంట్లను జేసీ సిబ్బందితో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి నిత్యం రేషన్ దుకాణాలకు సరుకుల పంపిణీ జరుగుతోందని, వాటి వివరాలు, తూనికలు పారదర్శకంగా ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వసతి గృహాలకు సంబంధించి సరఫరా చేసే సరుకులు నాణ్యంగా ఉండాలని చెప్పారు. ఈ విషయంలో ఎంఎల్ఎస్ పాయింట్లతోపాటు సరుకు పంపిణీదారులు కూడా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గ్యాస్ ఏజెన్సీలు తమ గోడౌన్లలో అన్ని భద్రతా ఏర్పాట్లు నిత్యం పరిశీలించుకోవాలని చెప్పారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సివిల్ సప్లైస్ డీఎం జి.లక్ష్మి పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోదాముల పరిశీలన

గుంటూరు రూరల్: జిల్లాలోని పలు పౌరసరఫరాల గోదాములు దుకాణాలను పౌరసరఫరాలు, జాయింట్ కలెక్టర్ రాజకుమారి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని గుంటూరు రూరల్, అర్బన్, ప్రాంతాల్లోని ఎమ్ఎల్ఎస్ పాయింట్లను, సందర్శించారు. స్టాక్ వివరాలను పరిశీలించారు. గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ, పెదకాకాని, గుంటూరు రూరల్ మండలాల పాయింట్ నుంచి గుంటూరు తూర్పు రూరల్, గుంటూరు పశ్చిమ రూరల్, ఫిరంగిపురం, మేడికొండూరు, వట్టిచెరుకూరు మండలాల గోదాములను జేసీ పరిశీలించారు. తూకం ప్రకారం రేషన్ బియ్యం సరుకులు, ఐసీడీఎస్ కేంద్రాలకు మధ్యాహ్న భోజనం సరుకులు ఏవిధంగా పంపిణీ చేస్తున్నారో ఆరా తీశారు. ఎప్పటికప్పుడు వచ్చిన స్టాకు, పంపిణీ చేసిన సరుకుల పరిమాణాలను, స్టాకు వచ్చిన తేదీని డిస్‌ప్లేలో చూపించాలని అధికారులను ఆదేశించారు. గోదాముల సమీపంలోని గ్యాస్ గోడౌన్‌ను సందర్శించి ప్రతిరోజూ ఏవిధంగా గ్యాస్ సిలిండర్లను ప్రజలకు పంపిణీ చేస్తున్నారో, రికార్డులు ఏవిధంగా నమోదు చేస్తున్నారో తనిఖీ చేశారు.

అనుమతుల్లేని మిరప విత్తనాలు స్వాధీనం

- యద్లపాడు, నాదెండ్ల మండలాల్లో గుంటూరు రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు
- రెండు షాపుల్లో రూ.4,78,953 విలువైన మిరప విత్తనాలు గుర్తింపు



యద్లపాడులోని ఓ విత్తన దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

యద్లపాడు: గుంటూరు రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం నేతృత్వంలో పలు విత్తనాల విక్రయ దుకాణాల్లో బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు యద్లపాడు, నాదెండ్ల మండలాల్లో అనుమతులు లేని విత్తనాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో ఈ దాడులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో ఆయా మండలాల వ్యవసాయ అధికారులతో కలిసి విస్తృత సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో యద్లపాడు, నాదెండ్ల మండల కేంద్రాల్లోని రెండు షాపుల్లో అనుమతి పత్రాలు లేని రూ.4,78,953 విలువైన 5 కేజీల ప్యాకెట్లను అధికారులు గుర్తించారు.

నేటి నుంచి ఈ-సెట్ కౌన్సెలింగ్

- 30 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు అవకాశం
- ఆన్‌లైన్‌లోనే విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన
- ధ్రువపత్రాల్లో తప్పులుంటేనే కౌన్సెలింగ్ కేంద్రానికి..
- గుంటూరు జిల్లాలో ఒక హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు
- జూలై ఒకటి నుంచి కళాశాలల ఎంపిక కోసం వెబ్ కౌన్సెలింగ్



విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ విద్యార్హతతో బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం కోసం ఉద్దేశించిన ఏపీ ఈసెట్-2024 కౌన్సెలింగ్ గురువారం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఈ-సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు బుధవారం ప్రారంభమైన ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 30 వరకు కొనసాగనుంది. ఏపీఈసెట్-2024లో అర్హత సాధించి, కళాశాలల్లో చేరేందుకు ఎదురుచూస్తున్న విద్యార్థులు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. విద్యార్థులెవ్వరూ భౌతికంగా హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన విద్యార్థుల ధ్రువపత్రాలను మరుసటి రోజున సంబంధిత హెల్ప్‌లైన్ కేంద్రాలకు ఆన్‌లైన్‌లో చేరతాయి. సంబంధిత హెల్ప్‌లైన్ కేంద్రంలోని అధికారులు విద్యార్థులు అప్లోడ్ చేసిన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే పరిశీలించి, ఆమోదిస్తారు. ధ్రువపత్రాల పరిశీలన అసంపూర్తిగా ఉన్న విద్యార్థులకే హెల్ప్‌లైన్ కేంద్రంలో భౌతికంగా సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు జూలై 1,2,3,4వ తేదీల్లో ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలల ఎంపికకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపుతో మొదలయ్యే ప్రక్రియ

- ఏపీ ఈసెట్-2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపుతో పాటు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. సెట్స్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా ఈసెట్-2024కు లాగిన్ అయ్యి ఈసెట్ హాల్ టిక్కెట్, జనన తేదీ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రాసెసింగ్ ఫీజు రూపంలో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.600 చొప్పున ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలి.
- ఏపీ ఈసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు హెల్ప్‌లైన్ కేంద్రాలకు విధిగా వెళ్లాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈ సెట్‌కు దరఖాస్తు చేసే సమయంలోనే విద్యార్థులు సమర్పించిన టెన్త్, పాలిటెక్నిక్ మార్కుల జాబితాలు, సామాజికవర్గ, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను సాంకేతిక విద్యాశాఖ వెబ్ బేస్డ్ విధానంలో పూర్తిచేసింది.
- ఈ సెట్ రిజిస్ట్రేషన్ సమయంలో హాల్‌టికెట్ నంబరు, జననతేదీ వివరాలను సబ్మిట్ చేసిన విద్యార్థుల ధ్రువపత్రాలకు సంబంధించిన వివరాలు కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతాయి. ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన విజయవంతంగా పూర్తయిందని డిస్‌ప్లేలో ప్రత్యక్షమైతే, సంబంధిత విద్యార్థులు షెడ్యూల్ ప్రకారం నేరుగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.
- క్యాండిడేట్ ఈజ్ నాట్ ఎలిజిబుల్ ఫర్ ఎక్సర్‌సైజ్ ఆప్షన్స్ అని వస్తే, సంబంధిత ధ్రువపత్రాలతో హెల్ప్‌లైన్ కేంద్రంలో పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుంది.
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ పురోగతిలో ఉన్నట్లు డిస్‌ప్లే అయితే విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధంగా ఉండాలి.
- గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

మత్తు రహిత జిల్లానే లక్ష్యం



ప్రదర్శనను జెండాలు ఊపి ప్రారంభిస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి లీలావతి, ఎస్పీ తుషార్ డూడీ

- విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి
- 100 రోజుల్లో డ్రగ్స్ రహిత జిల్లా కోసం కృషి
- గుంటూరు నగరంలో అవగాహన ర్యాలీ, మానవహారం

నగరంపాలెం(గుంటూరు జిల్లా): మత్తు పదార్థాలను జిల్లా నుంచి పారదోలేందుకు అందరూ కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి టి.లీలావతి పేర్కొన్నారు. ఏపీ ఎస్ఈబీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా బుధవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ వద్ద అవగాహన ర్యాలీని డీఎల్ఎస్ఏ కార్యదర్శి లీలావతి, జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ జెండాలు ఊపి ప్రారంభించారు. నగరంపాలెం మీదుగా మూడు బొమ్మల సెంటర్, హిందూ కళాశాల కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం విద్యార్థులు, యువత మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తామని విద్యార్థులు, ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి లీలావతి మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ రానున్న వంద రోజుల్లో డ్రగ్స్ రహిత సమాజం కోసం చర్యలు చేపడతామని వెల్లడించారు. డ్రగ్స్ రహిత జిల్లాగా గుర్తింపు తీసుకొస్తామన్నారు. ర్యాలీలో విద్యార్థులు, యువత, తూర్పు సబ్ డివిజన్ ఏఎస్పీ నచికేత్ షెల్కే, ఎస్ఈబీ ఏఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, డీఎస్పీలు మహేష్ (పశ్చిమ), శాంతకుమార్(ఏఆర్), ఎస్ఈబీ సూపరింటెండెంట్ రంగారెడ్డి, ఏఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి, సీఐలు పి.విజయ్, బి.లత, ఎస్బీ సీఐ వెంకట్రావు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతి పరిశీలనకు
అకడమిక్ మానిటరింగ్ బృందాలు

జిల్లా విద్యాశాఖాధికారి శైలజ



లలిత ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఈఓ శైలజ, డీవైఈఓ వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల గుణాత్మక ప్రగతిని పరిశీలించేందుకు జిల్లా ఉమ్మడి పరీక్ష మండలి (డీసీఈబీ) సహకారంతో అకడమిక్ మానిటరింగ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ చెప్పారు. బుధవారం పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో డీఈఓ శైలజ అధ్యక్షతన డీసీఈబీ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. డీఈఓ శైలజ మాట్లాడుతూ మండలస్థాయిలో ఏర్పాటు చేయనున్న అకడమిక్ మానిటరింగ్ బృందాలు నెలలో రెండుసార్లు సంబంధిత మండలంలోని పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల ప్రగతిని అంచనా వేయాలని సూచించారు. ఆయా బృందాల పరిశీలన నివేదికను ప్రతినెలా సంబంధిత పర్యవేక్షక అధికారులు పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలల్లో డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతతోపాటు సురక్షిత నీటిని అందించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించేలా ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలలు చర్యలు తీసుకోవాలన్నారు. గుంటూరు డీవైఈఓ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అకడమిక్ మానిటరింగ్ బృందాలకు పాఠశాలల సందర్శనలో సహకారాన్ని అందిస్తామని తెలిపారు. డీసీఈబీ కార్యదర్శి ఎ.తిరుమలేష్ మాట్లాడుతూ అకడమిక్ మానిటరింగ్ బృందాలు జిల్లాలో పాఠశాల విద్య పురోగతికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పూర్వ కార్యదర్శి జి.లలిత ప్రసాద్ ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ పరీక్షల విభాగ జిల్లా సహాయ కమిషనర్ వెంకట్‌రెడ్డి, డీసీఈబీ కార్యవర్గ సభ్యులు, పలువురు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అనుమానమే పెనుభూతమై..

గొంతునులిమి భార్యను హతమార్చిన భర్త



మృతురాలు మేడా సాయిభవాని

చిలకలూరిపేట: అనుమానమే పెనుభూతమై కట్టుకున్న భార్యను భర్త గొంతునులిమి హత్య చేసిన ఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మేడా సాయి భవాని(19) భర్త కనపర్తి సురేష్‌తో కలసి పట్టణానికి మంచినీరు సరఫరా చేసే చెరువుల మార్గంలో ఉన్న టిడ్కో గృహ సముదాయంలో ఉంటోంది. ఆమెకు మొదటగా నాలుగేళ్ల కిందట మీసాల పృథ్వీతో వివాహం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో విడాకులు తీసుకున్నారు. అనంతరం ఏడాది కిందట కనపర్తి సురేష్‌ను రెండో వివాహం చేసుకుంది. ఈ నేపథ్యంలో సురేష్ గత కొంత కాలంగా సాయిభవాని తన మొదటి భర్తతో ఫోన్‌లో మాట్లాడుతుందని అంటూ అనుమానం వ్యక్తం చేస్తూ వేధించసాగాడు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రాత్రి మాట్లాడాలని చెప్పి తన భార్యను టిడ్కో గృహ సముదాయానికి దూరంగా పొలాల్లోకి తీసుకువెళ్లి గొంతు నులిమి హతమార్చాడు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 504.20 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 815.10 అడుగుల వద్ద ఉంది.

క్లుప్తంగా

శ్రీకాకుళం-కడప మ్యాచ్ డ్రా



4 వికెట్లు తీసిన కడప జట్టు బౌలర్ గైలు

మంగళగిరి: అమరావతి క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ అండర్-16 మల్టిడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలలో కడప-శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రా అయింది. బుధవారం జరిగిన రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం జట్టు 72 ఓవర్లలో 100 పరుగులు చేసి ఆలౌటైంది. జట్టు బ్యాట్స్ మెన్ కె.చరిత్ 39 పరుగులు చేశాడు. కడప జట్టు బౌలర్ జి.గైలు నాలుగు వికెట్లు తీసి శ్రీకాకుళం జట్టును కట్టడి చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు 2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 9 పరుగులు చేసింది. సమయం ముగియడంతో మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీకాకుళం జట్టు ఆధిక్యత సాధించింది. ఆ జట్టు 113.2 ఓవర్లలో 240 పరుగులు చేసి ఆలౌట్ కాగా కడప జట్టు 63 ఓవర్లలో 210 పరుగులు చేసి ఆలౌటైంది.

రజక వృత్తిదారుల కోసం సామాజిక రక్షణ చట్టం తేవాలి

ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి

తాడేపల్లిరూరల్ : రజకుల కోసం సామాజిక రక్షణ చట్టం అమలు చేయాలని, రజక సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించి నిధులు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మేనిఫెస్టోలో తెలిపిన విధంగా సామాజిక రక్షణ చట్టం వెంటనే చేయాలని, కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేసి రజకుల అభివృద్ధి, సంక్షేమానికి ఆ నిధులు ఖర్చు చేయాలని, మోడరన్ దోబీ ఘాట్లు ఏర్పాటు చేసి, ఆదరణ పథకం ద్వారా రజక వృత్తిదారుల, వృత్తి నిర్వహణకు అవసరమైన పరికరాలను వెంటనే అందజేయాలని, 50 ఏళ్లు దాటిన ప్రతి రజక వృత్తిదారునికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని, రజకులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని భాస్కరయ్య డిమాండ్ చేశారు.

కలుషిత నీరు కట్టడికి చర్యలు

- తాగునీటి నమూనాలు సేకరించాలి
- గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి



తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌తో కలిసి ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరా జరిగే సమయాల్లో తాగునీటి నమూనాలు విరివిగా సేకరించాలని, కలుషిత నీటి సరఫరాను గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తాగునీటి సరఫరా, డ్రెయిన్లలో ఉన్న పైప్‌లైన్ల మరమ్మతులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వార్డు సచివాలయం వారీగా ప్రతి ఎమినిటి కార్యదర్శి తప్పనిసరిగా తాగునీటి సరఫరా సమయంలో శాంపిల్స్ సేకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని యూజీడీ లైన్లు ఎప్పటికప్పుడు క్లీన్ చేయాలని, సుద్దపల్లి డొంకలోని యూజీడీ ట్రీట్మెంట్ ప్లాంట్ పక్కాగా పని చేసేలా ఈఈ కోటేశ్వరరావు నేరుగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఫిర్యాదు వస్తే ఏఈలు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని, తాగునీటి కాలుష్యంపై అందే ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో నగర ప్రజలు కొందరు డయేరియా లక్షణాలతో చికిత్స పొందుతున్నారని, గుంటూరు నగరంలో గతంలో వెలుగుచూసిన డయేరియా కేసులను దృష్టిలో ఉంచుకొని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీటి పైప్‌లైన్లు ఎక్కడైనా డ్రెయిన్‌లో ఉంటే వాటిని తక్షణం మార్చాలన్నారు. ప్రత్యేకంగా మద్దిరాల కాలనీ, బసవతారకరామ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తాగునీటి నమూనాలు సేకరించాలని సూచించారు. మురుగు డ్రెయిన్లు నీటి పారుదల లేక నిలిచిపోతే వెంటనే కచ్చా డ్రెయిన్లు తవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఈ శ్యాం సుందర్, సీఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్ఓ(ఎఫ్ఏసి) మధుసూదన్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, కొండారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు పోకుండా కాపాడవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి చెప్పారు. బుధవారం గుంటూరు మెడికల్ కాలేజీలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలకు 'సబ్ డిస్ట్రిక్ లెవెల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' ముగింపు సందర్భంగా డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్త్రీలలో బ్రెస్ట్, సర్వైకల్, నోటి క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం ఎలా అనే అంశంపై శిక్షణ పొందిన వారు ఇంటింటి సర్వేలో నిశితంగా కేసులను పరిశీలించి గుర్తించాలన్నారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలకు సంబంధించిన ఆరు ప్రశ్నల పత్రాన్ని తీసుకుని వెళ్లి, గృహ సందర్శనలో ప్రశ్నలు అడిగి క్యాన్సర్ కేసులను గుర్తించి చికిత్స కోసం రిఫర్ చేయాలన్నారు. కేసు తీవ్రతను బట్టి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రి, టీచింగ్ ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ రాఘవేంద్ర పాటిల్, డాక్టర్ ఎ.శ్రావణ్ బాబు, డాక్టర్ చుక్క రత్నమన్మోహన్, డాక్టర్ ఇ.అన్నపూర్ణ డాక్టర్ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలు సత్వరమే గుర్తించాలి

పుట్టుకతో వచ్చే లోపాలను సత్వరమే గుర్తించి చికిత్స అందించాలని డైక్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో డిఫెక్ట్స్, డిలేస్, డిసార్డర్స్, డిసీజెస్ అనే అంశాలపై వైద్యులకు, నర్సింగ్ సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పసికందు మొదలు 18 సంవత్సరాల పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలపై వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. లోపాలను ఏవిధంగా గుర్తించాలనే విషయాలను వివరించారు. లోపాలు గుర్తించిన వారిని వైద్యం, ఆపరేషన్‌ల కోసం గుంటూరు జీజీహెచ్, తెనాలి జిల్లా ఆస్పత్రిలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లకు పంపాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డాక్టర్ కె.వి సుబ్బరాజు, డాక్టర్ ఈ అన్నపూర్ణ, డాక్టర్ ప్రియాంక. డాక్టర్ కీర్తి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో కొత్త టీచర్లకు శిక్షణ

గుంటూరు రూరల్: పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం ఒంగోలు క్లస్టర్‌లో నూతనంగా విధుల్లో చేరిన 45 మంది ఉపాధ్యాయులకు గత ఐదు రోజులుగా బోధన, ఇతర అంశాలపై శిక్షణ, అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. నల్లపాడు గ్రామంలోని కేంద్రీయ విద్యాలయంలో బుధవారం నిర్వహించిన ఓరియంటేషన్ చివరి రోజు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాఠశాల ప్రిన్సిపల్, కోర్స్ డైరెక్టర్ హనీమెహత మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ సులభతర పద్ధతిలో బోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ టి.లక్ష్మి, ఉపాధ్యాయులు ఆనంద్, ఆర్.సాయి రామ్, ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గారపాడులో ఇరువర్గాల ఘర్షణ

గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం గారపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ వర్గాల మధ్య మంగళవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఏడుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. గారపాడు గ్రామంలో నిత్యం వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఎన్నికలు పూర్తయిన దగ్గర నుంచి ఇప్పటివరకు వరకూ నిత్యం గ్రామంలో పోలీస్ పికెట్ నిర్వహిస్తూనే ఉన్నారు. పోలీస్ పికెట్ ఉన్నా వివాదాలు జరుగుతుండటం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా వివాదాలను పోలీసులు అరికట్టి శాంతిభద్రతలను కాపాడాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కేఎల్‌యులో ముగిసిన ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న గుంటూరు ఎన్‌సీసీ క్యాడెట్లు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో ఈనెల 15 నుంచి నిర్వహిస్తున్న ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్ శిబిరం బుధవారంతో ముగిసింది. క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఎస్.ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ శిబిరానికి గుంటూరు, విశాఖ, కాకినాడ, కర్నూలు, తిరుపతి గ్రూపులు, రాజస్థాన్ డైరెక్టరేట్‌లోని జోధ్‌పూర్, ఉదయ్‌పూర్ గ్రూపులకు చెందిన క్యాడెట్లతోపాటు ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌ల నుంచి మొత్తం 600 మంది క్యాడెట్లు హాజరయ్యారని, శిబిరాన్ని ఏపీ తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లకు చెందిన గుంటూరు గ్రూప్ నిర్వహించినట్టు వివరించారు. సుమారు 12 రోజులపాటు కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని చారిత్రక ప్రదేశాలను ఎన్‌సీసీ క్యాడెట్లు సందర్శించారని వెల్లడించారు. కొండవీడులో పర్వతారోహణ చేశారని వివరించారు. ప్రతిభ కనబరిచిన క్యాడెట్లు బహుమతులు అందుకున్నారని పేర్కొన్నారు. శిబిరంలో గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ వారు ఓవరాల్ బహుమతిని పొందినట్టు వెల్లడించారు. శిబిరం ముగింపు సందర్భంగా క్యాడెట్లు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ కల్నల్ సి.ఎస్. సిద్ధు, డెప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎస్.వి.ఎస్.సుదర్శన్, వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, కేఎల్‌యూ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ పావని తదితరులు పాల్గొన్నారు.

చత్రపతి సాహు మహారాజ్ జయంత్యుత్సవం



చత్రపతి సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): 1902వ సంవత్సరంలో తన రాజ్యంలో బహుజనులకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన గొప్ప రాజు చత్రపతి సాహు మహారాజ్ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. చత్రపత్తి సాహు మహారాజ్ జయంతిని పురస్కరించుకుని కాకుమాను వారితోటలోని యానాది కాలనీలో ఆయన చిత్రపటానికి బుధవారం రజక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూపూడి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చత్రపతి సాహు మహారాజ్ రాజ్యంలో చదువుకుని దేశానికి రాజ్యాంగం రాసే స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్ మాట్లాడుతూ సాహు మహారాజ్ స్ఫూర్తితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారన్నారు. కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు నిడుముక్కల రాంబాబు, ఈమని ఉమామహేశ్వరరావు, నక్క రవి, వట్టికూటి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి పవన్‌కుమార్

తెనాలిరూరల్: పిల్లలు విలువలతో కూడిన విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్ కుమార్ ఆకాంక్షించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా తెనాలి మండలం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తెనాలి గంగానమ్మ పేటలోని గుప్తా డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. న్యాయమూర్తి పవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాలకు ఆకర్షితులు కాకుండా విద్యపై దృష్టి పెట్టాలని, ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టపడాలని చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నేరమని చెప్పారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కృష్ణ, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ చీకటి శకం



సన్మాన కార్యక్రమంలో ఎమర్జెన్సీలో జైలు జీవితం గడిపిన నేతలు

గుంటూరు మెడికల్: సిటిజన్స్ ఫోరం ఫర్ డెమోక్రసీ కన్వీనర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి సారథ్యంలో స్థానిక బ్రాడీపేటలోని మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థలో బుధవారం ఎమర్జెన్సీ వ్యతిరేక వారంలో భాగంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీలో జైలు జీవితం గడిపిన నేతలను సన్మానించారు. సోషలిస్ట్ నేత మోదుగుల పాపిరెడ్డి, ఆర్ఎస్ఎస్ నేతలు మర్రిశంకరరావు, కొల్లిపర శివరామ్, న్యాయవాది పగడాల సాంబశివరావు, మున్నలూరి ఉపేంద్రగుప్తా, వీహెచ్‌పీ నేత చక్కా హరనాథ్‌లను, అజ్ఞాతంగా సేవలందించిన బీజేపీ నేత కొత్తూరు వెంకట సుబ్బారావు, ఏబీవీపీ నేత కోట బ్రహ్మయ్య, కిడాంబి దేవరాజ్‌లను సత్కరించారు. అనంతరం ముఖ్యవక్త, విద్యావేత్త, సంస్కారభారతి దక్షిణ భారత ప్రాంతీయ కార్యదర్శి బైరిశెట్టి మల్లికార్జునరావు మాట్లాడుతూ అధికార దుర్వినియోగం న్యాయస్థానంలో రుజువు కావటంతో తనను ఎవరు ప్రశ్నించరాదని అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారని గుర్తుచేశారు. ప్రతిపక్ష నాయకులను జైళ్లలో పెట్టడం, పత్రికా స్వేచ్ఛకు సంకెళ్ళు వేయటం, పౌర హక్కులను రద్దు చేయటం ద్వారా కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. ఇందిర తనయుడు సంజయ్ గాంధీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లంటూ సాగించిన అమానుషాల వల్ల భారతదేశ పరువు ప్రపంచ దేశాల ఎదుట మంట కలిసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, డాక్టర్ కల్లగంటి నాగార్జున, ప్రధాన కార్యదర్శి చరక కమార్ గౌడ్, కంతేటి బ్రహ్మయ్య, పోకూరి జితేంద్ర, జంధ్యాల రామలింగ శాస్త్రి, ఆవుల రాము, నడ్డి నాగ మల్లీశ్వరి, స్టాలిన్, డాక్టర్ స్రవంతి, మహాలక్ష్మి, వాణి నిర్మల, అంకాల శ్రీను, సురేష్ జైన్, వెంకట రమణ, సాధు రామకృష్ణ, పురుషోత్తం, నరేష్, కమల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కల్పిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ బి.సాయివరప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్ హెల్పర్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఆటోమొబైల్ వాషర్ ట్రేడ్‌లలో ఈనెల 30 నుంచి ప్రారంభం కానున్న ఉచిత శిక్షణకు టెన్త్ విద్యార్హతతో 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులు కలెక్టరేట్ ఎదుట ఉన్న ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 80746 07278, 83339 73929 నంబర్లలో సంప్రదించాలని వివరించారు.

మైక్రో బయాలజీకి ఎన్ఏబీఎల్ గుర్తింపు



మైక్రోబయాలజీ గుర్తింపు పత్రాలతో విభాగాధిపతి డాక్టర్ పరమేశ్వరి, డాక్టర్ ఇజ్రాయిల్ తదితరులు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల మైక్రో బయాలజీ వైద్య విభాగానికి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కలాబ్రేషన్ లేబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) గుర్తింపు మరోసారి లభించింది. గతంలో ఉన్న గుర్తింపును రెన్యూవల్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు అందాయి. ఎన్ఏబీఎల్ సర్టిఫికెట్ మైక్రోబయాలజీ విభాగానికి అందడంతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, మైక్రోబయాలజీ వైద్యులకు అభినందనలు తెలిపారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.పరమేశ్వరి, ఎస్ఆర్ఎల్ ల్యాబ్ ఇన్‌చార్జి, క్వాలిటీ మేనేజర్ డాక్టర్ ఇజ్రాయల్, మైక్రోబయాలజీ సిబ్బంది టి.ఓ.పవన్‌కుమార్, నాగేశ్వరరావు, ముస్తఫా, మేరికుమారి, విజయరాణి, శ్రీనివాస్, సుబ్బారావు, విష్ణు, నాగరాజు, ఇతర సిబ్బందికి ప్రిన్సిపాల్, కళాశాల అధికారులు అభినందనలు తెలిపారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు



ర్యాలీలో పాల్గొన్న ఎస్ఈబీ అధికారులు

మంగళగిరి: మాదక ద్రవ్యాల వినియోగం జీవితాలను నాశనం చేస్తోందని ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నియంత్రణ దినం సందర్భంగా పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వద్దు.. జీవితం ముద్దు అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎస్ఈబీ జేడీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని యువతను కోరారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఏఈఎస్ ఎస్.కృష్ణ కిషోర్, సీఐ పి.ప్రసన్న లక్ష్మి, ఎస్ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

దడ పుట్టిస్తున్న డయేరియా

గుంటూరు మెడికల్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొద్దిరోజులుగా డయేరియా కేసులు ప్రతిరోజూ నమోదవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో బుధవారానికి పది మంది చిన్నారులు, 29 మంది పెద్దవారు డయేరియాతో చికిత్స పొందుతున్నారు. వీరిలో 16 మంది ఇటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయూ)లో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరికి కిడ్నీల పనితీరు మందగించడంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. గుంటూరు నగరానికి చెందిన వారు ఏడుగురు, మాచర్ల, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వారు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. కాగా వర్షాకాలంలో డయేరియా కేసులు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. ముఖ్యంగా వాంతులు, విరేచనాలు సోకకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు.

గంజాయి కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్

తెనాలిరూరల్: వ్యసనాలను విడనాడాలని గంజాయి కేసుల్లో నిందితులు, సస్పెక్ట్ షీటర్లకు డీఎస్పీ ఎం.రమేష్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని తెనాలి పట్టణ, రూరల్, కొల్లిపర పోలీస్‌స్టేషన్లలో గంజాయి కేసుల్లో నిందితులకు టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిషేధిత మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత మాదక ద్రవ్యాల గురించిన సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. డీఎస్పీ వెంట వన్‌టౌన్‌సీఐ జి. దశరథరామారావు, టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్, త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, రూరల్ సీఐ టి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి. కోటేశ్వరరావు, కొల్లిపర ఎస్ఐ రవీంద్రరెడ్డి ఉన్నారు.

జూలై 19 నుంచి 21 వరకు వివా 'మోడల్ యునైటెడ్ నేషన్స్'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, తదితరులు

పెదకాకాని: వివా ది స్కూల్‌లో జూలై 19 నుంచి 21 వరకు మూడు రోజులపాటు మోడల్ యునైటెడ్ నేషన్స్ (మోడల్ ఐక్య రాజ్య సమితి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వివా పాఠశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ చెప్పారు. మండలంలోని నంబూరు వివా ది స్కూల్‌లో మూడు రోజులుపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఐక్య రాజ్యసమితి కార్యకలాపాలను ప్రతిబింబించేలా వివా విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ 8 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న అన్ని పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో పాల్గొనదలచిన విద్యార్థులు వివాఎంయూఎన్.వివా.స్కూల్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న విద్యార్థులను ఈ కార్యక్రమంలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌ఓ), యునైటెడ్ నేషన్ సెక్యూరిటీ కౌన్సిల్ (యూఎన్ఎస్‌సీ), యునైటెడ్ నేషన్ హ్యూమన్ రైట్స్ కమిషన్ (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) వంటి పలు విభాగాలుగా విభజించి పలు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పోటీలలో పాల్గొనే ప్రతి విద్యార్థి ఒక దేశం తరపున ప్రాతినిధ్య వహించేలా కార్యక్రమం రూపొందించామని వెల్లడించారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పరిశోధనా నైపుణ్యాలు, అంతర్జాతీయ సమస్యలపై అవగాహన మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఐటీ కమాండర్ కె శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సీహెచ్ సరళ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.